
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
సోమవారం 17 నవంబరు 2025



అత్తింటి వేధింపులు తాళలేక
వివాహిత ఆత్మహత్య
సంగారెడ్డి జిల్లా పెద్దారెడ్డిపేటలో విషాదం
భర్త, అత్త, మామలపై కేసు నమోదు 6



దేదీప్యమానం.. లక్షదీపోత్సవం

తూప్రాన్ పట్టణ పరిధి వెంకటాపూర్ (పీటీ) శివారులో లలితా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం లక్ష దీపోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఆలయ వ్యవస్థాపకులు, దేవీ ఉపాసకులు బ్రహ్మశ్రీ సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలను నిర్వహించారు. రాత్రి లక్ష దీపోత్సవం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
- తూప్రాన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి)

తగ్గేదేలే!

మూడో రోజూ సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు
కోహీర్‌లో 8.1 డిగ్రీలు



సిద్దిపేట పట్టణంలో ఉదయం వేళ రోడ్డును కప్పేసిన మంచు

కోహీర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. సాయంత్రం 5 గంటల నుంచే చలి ప్రారంభమవుతుంది. ఉదయం సాయంత్రం, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో మూడో రోజు కనిష్ఠ ఉష్ణోగ్రత సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. ఆదివారం 8.1 డిగ్రీలు నమోదైంది. ఉమ్మడి జిల్లాలోని సదాశివపేట, ఝరాసంగం, న్యాల్కల్, నల్లవల్లి, కొండపాక, అంగడి కిష్టాపూర్, పోతిరెడ్డిపేటలో పది డిగ్రీల లోపు అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో 25 చోట్ల 11 డిగ్రీల లోపు ఉన్నాయి.

బెట్టింగ్ భూతం

ఆన్‌లైన్ గేమింగ్ ఉచ్చుకు బలైపోతున్న జీవితాలు!

సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో లక్షలు సమర్పించేస్తున్నారు
అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యకు ఒడిగడుతున్న వైనం



సంగారెడ్డి క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్‌లకు అలవాటు పడుతున్న యువత, ఉద్యోగులు లక్షల్లో నష్టపోతున్నారు. అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఈ వ్యసనం విషాదంగా మారుతోంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు, పోలీసులు వరకు ఈ బెట్టింగ్ భూతానికి బలవుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఈ నెలలోనే ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.

సీజన్లకు అనుగుణంగా బెట్టింగ్ దందా

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ దందా నిరంతరం కొనసాగుతున్నప్పటికీ, ముఖ్యంగా క్రికెట్ వంటి సీజన్లలో ఇది మరింత ఊపందుకుంటోంది. రాజా బెట్స్, టీసీ గేమ్, బెట్ వైబ్, పరిమ్యాచ్, వన్‌ఎక్స్ బెట్, టెన్ క్రిక్, బ్యాటరీ, స్టేక్ వంటి అనేక యాప్‌లు ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాయి. బెట్ గెలిస్తే రెట్టింపు, మూడు రెట్లు, వంద రెట్లు డబ్బు వస్తుందని మిగతా 8వ పేజీలో

ఈజీ మనీ కోసం ఆశ పడొద్దు



ఈజీ మనీకి ఆశపడి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు డబ్బులు ఊరికే ఎవరికీ రావు. బెట్టింగ్‌లు పెట్టి లక్షలు సంపాదిస్తామని ఆశ పడి ఉన్న డబ్బు పోగొట్టుకుంటున్నారు. అప్పుల్లో కూరుకొని ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరం. డబ్బు ఈజీగా వస్తుందంటే అక్కడ మోసం వుంటుందని గమనించాలి. ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై, సైబర్ నేరాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. అన్ని కళాశాలలు, విద్యా సంస్థలు, పాఠశాలల్లో, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల బారిన పడియువత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.
- పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

ఈ నెలలోనే ముగ్గురి ఆత్మహత్య



- సంగారెడ్డి జిల్లా రాళ్లగూడుపల్లి పాఠశాలలో కంబాలపల్లి మొగులయ్య (35) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి, పెద్ద ఎత్తున అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మనస్తాపంతో సంగారెడ్డి సాయికృషి నగర్‌లోని తన అద్దె ఇంట్లో నవంబరు 13న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో ఓ సంస్థలో పెట్టుబడులు పెట్టి మోసపోవడం కూడా ఇతడిని మరింత కృంగదీసింది.
- రామచంద్రాపురంలో స్థిరపడిన కడపకు చెందిన అఖిల్(30) నగరంలోనే వర్క్‌షాప్‌ను నడిపేవాడు. క్రికెట్ బెట్టింగ్‌కు బానిసై రూ.6 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. అప్పులు పెరగడం, బెట్టింగ్‌లో డబ్బులు రాకపోవడంతో మనస్తాపానికి గురై ఓ లాడ్జిలో నవంబరు 11న ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కొటారి సందీప్‌కుమార్ (25) గత కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి లక్షల్లో అప్పులు చేశాడు. అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపానికి గురై నవంబరు 3న మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

వావిలాలలో పరిశ్రమల జాతర!

టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో 34 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్

హైదరాబాద్ నుంచి తరలివస్తున్న 110 చిన్న, సూక్ష్మ తరహా యూనిట్లు
రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు ముమ్మరం



వావిలాల 190 సర్వే నంబర్‌లో పరిశ్రమల కోసం కేటాయించిన స్థలంలో వేస్తున్న రోడ్డు

జిన్నారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని వావిలాల గ్రామం త్వరలో నూతన పారిశ్రామిక కేంద్రంగా మారనుంది. గ్రామంలోని సర్వే నంబర్ 190లో టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో చిన్న, సూక్ష్మ తరహా ఇంజనీరింగ్ పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) కోసం ప్రత్యేక పారిశ్రామికవాడ ఏర్పాటు పనులు చకచకా సాగుతున్నాయి.

యూనిట్లకు స్థలం కేటాయింపు

గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని బాలానగర్, సనత్‌నగర్ వంటి ప్రాంతాల నుంచి తరలించాలనుకుంటున్న చిన్న, సూక్ష్మ ఇంజనీరింగ్ పరిశ్రమల యూనిట్ల కోసం వావిలాలలో ఈ పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 34 ఎకరాల స్థలాన్ని ఇందుకోసం కేటాయించగా, ఇప్పటికే 110 యూనిట్లకు భూ కేటాయింపులు పూర్తయ్యాయి. ఇక్కడ జాబ్ వర్క్, ఇంజనీరింగ్ తదితర చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. బాలానగర్ మైక్రో, స్మాల్ పరిశ్రమల సమాఖ్య ఈ పరిశ్రమల సమూహారాన్ని ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర వహిస్తోంది.

మౌలిక వసతులు, అభివృద్ధి పనులు

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి మిగతా 8వ పేజీలో

ధాన్యం తూకంలో పొరపాట్లు చేయొద్దు

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



అంబాజీపేటలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం తూకంలో పొరపాట్లు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండలంలోని అంబాజీపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లోని ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో 27,993 మంది రైతుల నుంచి 1,19,461,560 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రూ.84 కోట్లు జమయ్యాయని తెలిపారు. గోదాముల్లో సరిపోను గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి : కలెక్టర్

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సిబ్బందికి సూచించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని ఆసుపత్రులను సీసీటీవీ కెమరాల ద్వారా మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, విధులకు హాజరు కావాలని సూచించారు.

బడి బయటి పిల్లలెందరు?

20 నుంచి పిల్లల గుర్తింపు సర్వే
విద్యాశాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 31 వరకు నిర్వహణ
గుర్తించిన వారిని బడిలో చేర్పించడమే లక్ష్యంగా కార్యాచరణ



సంగారెడ్డిలో బడి బయటి పిల్లల సర్వే చేస్తున్న సీఆర్పీ (ఫైల్)

సంగారెడ్డి అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చదువుకునే వయసులో ఆర్థిక స్థోమత, కుటుంబ పరిస్థితులు, ఇతర సమస్యలతో పలువురు బడికి వెళ్లడం లేదు. మరికొందరు ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ కూలీ పనులకు వెళుతుంటారు. ఇంకొందరు కుల వృత్తిలో కొనసాగుతూ విద్యకు దూరమవుతున్నారు. ఫలితంగా ఉన్నత విద్యనభ్యసించాలంటే వారి ఆశయం నెరవేరడం లేదు. దీంతో విద్యాశాఖ చర్యలు చేపట్టింది. బడీడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే విధంగా బడి బయటి పిల్లల గుర్తింపు పేరిట (ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్-ఓఎస్‌సీ)సర్వేను చేపట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది.

ఈ నెల 20 నుంచి సర్వే

ఈ నెల 20 నుంచి డిసెంబరు 31 వరకు సర్వే చేయాలని విద్యా శాఖ ఆదేశించింది. అయితే ప్రతీ ఏడాది విద్యా శాఖ రెండుసార్లు సర్వే నిర్వహిస్తున్నది. ఇప్పటికే ఈ ఏడాది జనవరి నెలలో నిర్వహించగా, తాజాగా రెండో విడత చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు.

వేర్వేరుగా 6-14, 15-19 ఏళ్ల పిల్లల గుర్తింపు

ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ పేరిట నిర్వహించే సర్వే ద్వారా 6-14 ఏళ్లలోపు బడీడు పిల్లలను, కళాశాల స్థాయిలో 15-19 ఏళ్ల వారిని వేర్వేరుగా గుర్తించి జాబితా రూపొందించనున్నారు. విద్యార్థి సామర్థ్యం, వయసు ప్రకారం వీరి అర్హత, ఆసక్తిని బట్టి తగిన తరగతిలో చేర్పించటం, దూర విద్యలో ప్రవేశాలు కల్పించేలా అధికారులు కృషి చేయనున్నారు. విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్ష కింద పనిచేసే సీఆర్పీలు క్షేత్రస్థాయిలో వెళ్లి ఈ సర్వే చేయనున్నారు. ముఖ్యంగా ఆవాస ప్రాంతాలు, గృహాలు, పనిప్రదేశాలను సందర్శించి ఆరా తీసి వివరాలు సంబంధిత ప్రొఫార్మాలో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రబంద్ పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తారు. వారిని వచ్చే విద్యా సంవత్సరం నుంచి బడికి వచ్చేలా చర్యలు తీసుకుంటారు.

పకడ్బందీగా సర్వే నిర్వహణ



జిల్లాలో బడి బయట ఉన్న వారి వివరాలు సేకరించేందుకు ఈ నెల 20 నుంచి పకడ్బందీగా సర్వే నిర్వహించనున్నాం. సీఆర్పీలు క్షేత్ర స్థాయిలో వెళ్లి సమగ్ర సమాచారాన్ని నమోదు చేస్తారు. బడీడు పిల్లలు, చదువులు మధ్యలో ఎందుకు నిలిపివేశారనే అంశాలు, పరిస్థితులపై ఆరా తీస్తాం. వివిధ కారణాలతో బాల, బాలికలు చదువుకు దూరం కాకుండా వంద శాతం బడిలో చేర్పించాలన్నదే సర్కారు లక్ష్యం.
- ఎస్.వెంకటేశ్వర్లు, సంగారెడ్డి డీఈవో



భవనాలున్నా.. వినియోగం సున్నా..

ఆదర్శ గ్రామం మల్కాపూర్‌లో కోట్లతో నిర్మించిన భవనాల నిర్వహణ కరువు
అల్లాదుర్గం మండలంలోని కొత్త జీపీలకు లేని సొంత భవనాలు
అంగన్‌వాడీ, పాఠశాల గదుల్లోనే కార్యకలాపాలు
నిజాంపేటలో అద్దె భవనాల్లో ఆఫీసులు 7

వంతెన కిందకు దూసుకెళ్లిన కోళ్ల వ్యాన్

త్రుటిలో తప్పిన ప్రమాదం
నిజాంపేట మండలం నందిగామ శివారులో ఘటన 6

ఆటోను తప్పించబోయి.. వ్యాను బీభత్సం

ఇద్దరు డ్రైవర్లకు గాయాలు
దెబ్బతిన్న ఐదు బైక్‌లు 6

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌లో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు తృతీయ స్థానం 7

రోడ్డుపైనే వారసంత.. తప్పని చింత



నర్సాపూర్‌లో ప్రతీ వారం ప్రధాన రోడ్డుపైనే నిర్వహిస్తున్న సంత

నర్సాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో కూరగాయల మార్కెట్‌కు సరైన స్థలం లేకపోవడంతో, ఎన్నో ఏళ్లుగా ప్రధాన రహదారులపైనే సంత నిర్వహించడంతో పట్టణవాసులకు తిప్పలు తప్పడం లేదు. గతంలో ప్రతీ శుక్రవారం మాత్రమే సంత ఉండేది, ప్రస్తుతం మంగళవారం నిర్వహించడంతో రెండు రోజులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంతలో మున్సిపల్ అధికారులు తైబజార్ రుసుం వసూలు చేస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. ప్రధాన రహదారిపైనే సంత ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోవడమే కాక, పోలీస్‌స్టేషన్, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లే అధికారులు, సిబ్బంది, ప్రజలకు కూడా ఆ రెండు రోజులు రాకపోకలు గగనమవుతాయి. రోజు కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు కూడా రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను పరిష్కరించడానికి సుమారు రూ.2 కోట్లతో పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టినప్పటికీ, పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గతంలో మాంసం దుకాణాలున్న పాత భవనాన్ని కూడా సమీకృత మార్కెట్‌లో భాగంగా ఏర్పాటు చేస్తారనే ఉద్దేశంతో కూల్చివేయడంతో, ప్రస్తుతం వారు పోస్టాఫీసు సమీపంలో రోడ్డుపై తాత్కాలిక షెడ్లలో అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు సాగిస్తున్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తేనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.



మంచు మాటున దాగిన విషం

తెల్లవారి సూర్యోదయ వేళ రోడ్డుపై మంచు కమ్ముకున్నదనుకుంటున్నారా.. అయితే పొరపడినట్లే! ఇది పొగమంచు మాటున దాగి ఉన్న కాలుష్యం. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమల వారు విడుదల చేస్తున్న విషం. భెల్ కూడలి నుంచి జాతీయ రహదారికి ఒకవైపు భెల్ కాలనీలోని పచ్చదనం కారణంగా ఆహ్లాదంగా ఉంటుంది. కానీ అలానే కొంత ముందుకు ప్రయాణం చేసి, ఇక్రిశాట్ సమీపంలోకి రాగానే వాయుకాలుష్యంతో కూడిన పొగమంచు ఊపిరి తీసుకోలేంత ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- పటాన్‌చెరు నవంబరు 16 (ఆంధ్రజ్యోతి)

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



కుటుంబ పెద్దలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నర్సాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న బాలికకు వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం బాలిక వివాహం జరుగుతుందన్న సమాచారం అందడంతో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి హేమభార్గవి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ, స్వప్న, చైల్డ్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ గంగాధర్, స్థానిక ఎస్‌ఐ రంజితకుమార్ సహకారంతో కూడిన అధికారుల బృందం ఆదివారం ఫంక్షన్ హాల్‌కు వెళ్లింది. వివాహం నిర్వహిస్తున్న ఇరు కుటుంబాల పెద్దలతో మాట్లాడి, బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలతో పాటు చట్టపరంగా ఎదురయ్యే సమస్యలను వివరించి, వివాహం జరగకుండా నివారించారు. బాల్య వివాహం చేస్తున్నందున సంబంధిత విషయాన్ని పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి సంగారెడ్డి జిల్లా అధికారులకు అప్పగించారు.

దూడపై గుర్తు తెలియని జంతువు దాడి

రాయపోల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని జంతువు దాడిలో ఓ దూడ మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అనాజీపూర్‌కు చెందిన కొత్త రవీందర్ రెడ్డి ప్రతిరోజు పశువులను పొలం వద్ద దొడ్డిలో కట్టేస్తుంటారు. శనివారం రాత్రి కూడా పశువులను కట్టేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వెళ్లి చూసేసరికి దూడ తీవ్ర గాయంతో మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి వచ్చి, దూడను చూసి చిరుతపులి దాడి చేసి చంపిందని ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా, బీట్ ఆఫీసర్ వేణు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఇది చిరుత పులి దాడిలా కనిపించడం లేదని ఆయన తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, పశువులను పొలాల వద్ద కట్టేయవద్దని సూచించారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు.

వడియారం చెరువులో మొసళ్లు ప్రత్యక్షం



వడియారం గ్రామం ఊర చెరువులో మొసళ్లు

చేగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలంలోని వడియారం చెరువు పరిసరాలకు వెళ్లాలంటేనే జనం జంకాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువులోకి వరదనీరు చేరడంతో ఆదివారం రెండు మొసళ్లు చెరువులో కనిపించాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రతిరోజూ చెరువు మీదుగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం పొలాలకు వెళ్లేటప్పుడు ఆ రెండు మొసళ్లు నీటిపై తలలు ఎత్తి కనిపిస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. వెంటనే అటవీ శాఖ అధికారులు స్పందించి, మొసళ్లను త్వరగా పట్టుకుని చెరువును సురక్షితం చేయాలని, లేకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.



రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న మానవ హక్కుల సంఘం వేదిక సభ్యులు

మేల్, ఫీమేల్ వరి వంగడాల పేరిట మోసం

● పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్

చేగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు సరఫరా చేస్తూ రైతులను మోసం చేస్తున్న కంపెనీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని మానవ హక్కుల సంఘం వేదిక రాష్ట్ర కార్యదర్శి షేక్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం చేగుంట మండలం రుక్మాపూర్‌లో నకిలీ విత్తనాలతో పంట నష్టపోయిన రైతుల పొలాలను మానవ హక్కుల వేదిక నేతలు షేక్ అహ్మద్, దిలీప్, రోహిత్, సిరి బృందం పరిశీలించింది. రైతు సమస్యలను నమోదు చేసుకుని, వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా షేక్ అహ్మద్ మాట్లాడుతూ మేల్ , ఫీమేల్ వంగడాల పేరుతో ఉచితంగా విత్తనాలు సరఫరా చేసి కొన్ని కంపెనీలు రైతులను మోసం చేస్తున్నాయన్నారు. రుక్మాపూర్ ఒక్క గ్రామంలోనే 100 ఎకరాల పంటకు నష్టం వాటిల్లిందన్నారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.80 వేల నష్టపరిహారం కంపెనీల నుంచి ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని, ఇప్పటికైనా కేసులు నమోదు చేయాలన్నారు సొసైటీ చైర్మన్ పరమేష్, పంట నష్టపోయిన రైతులు శ్రీనివాస్, మోహన్, లక్ష్మి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



స్పందన

పటాన్‌చెరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లాపూర్ పురపాలక పరిధిలోని ముత్తంగి గ్రామం డీఎన్ కాలనీలో నివాసం ఉంటున్న 19 ఏళ్ల ఆలేటి స్పందన ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో, ఉదయం నుంచి చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించారు. ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి ప్రభుదాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక

వివాహిత ఆత్మహత్య

● సంగారెడ్డి జిల్లా పెద్దారెడ్డిపేటలో విషాదం

● భర్త, అత్త, మామలపై కేసు నమోదు



లక్ష్మి (ఫైల్)

పుల్కల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులను తాళలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకున్నది. ఆదివారం ఏఎస్‌ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం బిజిలీపూర్‌కు చెందిన కొప్పు లక్ష్మి(26)కి రెండున్నరేళ్ల క్రితం పుల్కల్ మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన పట్నం ప్రవీణ్‌కుమార్(30)తో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ. 9 లక్షల నగదుతో పాటు బంగారం, ఇతర లాంఛనాలను ప్రవీణ్‌కుమార్‌కు ఇచ్చారు. వివాహమైన నాలుగు నెలల పాటు వారి కాపురం సాఫీగా కొనసాగింది. అనంతరం పుట్టింటి నుంచి అదనంగా కట్నం తీసుకురావాలంటూ భర్త ప్రవీణ్‌కుమార్, అత్త, మామలు లక్ష్మిని వేధించడం ప్రారంభించారు. తరచూ వేధింపులకు గురి చేస్తుండటంతో, లక్ష్మి తల్లిదండ్రులు ఆమెను పుట్టింటికి తీసుకువెళ్లారు. మూడు నెలల పాటు పుట్టింట్లో ఉన్న లక్ష్మిని తీసుకువెళ్లేందుకు భర్త ప్రవీణ్‌కుమార్ గ్రామ పెద్దలను వెంట తీసుకువెళ్లి, బాగా చూసుకుంటానని చెప్పి కాపురానికి తీసుకువచ్చాడు. నెల రోజుల పాటు బాగానే ఉన్నా, తాజాగా శనివారం భర్త ప్రవీణ్‌కుమార్, అత్త యాదమ్మ, మామ యాదయ్యలు కలిసి ఆమెను చిత్రహింసలకు గురి చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మి శనివారం ఇంట్లో గదిలో దూలానికి ఉరేసుకుంది. ఇది గమనించిన భర్త ప్రవీణ్‌కుమార్ స్థానికుల సహాయంతో జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి 10 నెలల పాప ఉన్నది. తమ కూతురు లక్ష్మి మృతికి కారణమైన భర్త ప్రవీణ్‌కుమార్, అత్త మామలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి ఆదివారం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

సిద్దిపేట రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ కె.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం బురుగుపల్లి చౌరస్తాలో చలికి ఇబ్బంది పడుతుండగా చూసిన సిరిబోజు నరేంద్ర చారి అనే వ్యక్తి మానవత్వంతో అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని వద్ద లభించిన ఫోన్ నంబర్‌ల ఆధారంగా నగేష్, విఠల్ అనే మేస్త్రీలను విచారించగా, మృతుడు వరంగల్ జిల్లా మడికొండవాసిగా తెలిసింది. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ 8712667321, రూరల్ సీఐ 8712667320 నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.

వంతెన కిందకు దూసుకెళ్లిన కోళ్ల వ్యాన్

● త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కోళ్ల వ్యాను

నిజాంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వరదలకు దెబ్బతిని కుంగిపోయిన కల్వర్టు వద్ద ఓ కోళ్ల వ్యాన్ అదుపుతప్పి కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో పెనుప్రమాదం తృటిలో తప్పింది. వివరాల్లోకి వెళితే, ఆదివారం మండల పరిధిలోని నందిగామ గ్రామ శివారులో సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వేగంగా వెళుతున్న కోళ్ల వ్యాను ఒక్కసారిగా అదుపుతప్పి వంతెన కిందికి దూసుకెళ్లింది. ఈ తాత్కాలిక వంతెనపై నిత్యం వాహన రాకపోకలు కొనసాగుతున్నాయి. వంతెన నిర్మాణం సరిగా లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి, పూర్తిస్థాయి రోడ్డు పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఆటోను తప్పించబోయి...



అదుపుతప్పి పార్కు చేసిన బైక్‌లపై పడ్డ వ్యాన్

నర్సాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వైపు నుంచి మెదక్ వైపు వెళ్తున్న కోళ్లకు చెందిన ఖాళీ వ్యాను, నర్సాపూర్ బస్టాండు సమీపంలో యూటర్న్ చేస్తున్న ఆటో ఒక్కసారిగా రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వ్యాన్ అదుపుతప్పి మసీదులో ప్రార్థనలకు వచ్చిన వారు పార్కు చేసిన వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదు బైకులు పూర్తిగా దెబ్బతినగా, ఆటోకు కూడా వ్యాను తగిలింది. ఆటో డ్రైవర్‌తో పాటు వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, రోడ్డుపై పడిన వ్యానును తొలగించి, కేసు నమోదు చేశారు. మరో ఐదు నిమిషాలు ఆలస్యమైతే, మసీదులో ప్రార్థనలకు వెళ్లిన వారు బయటకు వచ్చి పార్కు చేసిన వాహనాల వద్దే ఉండే వారని, ఆ సమయంలో ప్రమాదం జరిగి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి డివైడర్‌పై ఉన్న చెట్లు ఏపుగా పెరగడం వల్ల యూటర్న్ ఉన్న చోట వాహనాలు కనిపించకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీం, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ హబీబ్ ఖాన్ పేర్కొన్నారు. ఆ చెట్లను తొలగించి, పూల మొక్కలు పెట్టాలని వారు డిమాండ్ చేశారు.



తూప్రాన్ : పిచ్చి మొక్కలతో నిండిపోయిన గ్రామ సామాజిక భవనం



రేషన్ దుకాణం, కూలీలకు వసతిగా యూత్ గ్రంథాలయ భవనం



నిజాంపేట : పురాతన భవనంలో నిర్వహిస్తున్న పోలీస్‌స్టేషన్

భవనాలున్నా.. వినియోగం సున్నా..

మెదక్ జిల్లాలోని కొన్ని మండలాల్లో ప్రజల కోసం, ప్రభుత్వ కార్యాలయాల కోసం నిర్మించిన భవనాలు వినియోగంలోకి రాక, కొత్తగా మంజూరైన భవనాల పనులు ప్రారంభం కాక అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. కొత్త మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసినా, ప్రజల అవసరాల కోసం కోట్లు ఖర్చు చేసి ఆదర్శ గ్రామాల్లో భవనాలు నిర్మించినా, వాటి నిర్వహణ, వినియోగం లోపించడంతో ప్రభుత్వ వసతులు వృథాగా మారుతున్నాయి.

- ఆదర్శ గ్రామం మల్కాపూర్‌లో కోట్లతో నిర్మించిన భవనాల నిర్వహణ కరువు
- మందుబాబులకు అడ్డాగా ఫంక్షన్‌హాల్
- అల్లాదుర్గం మండలంలోని కొత్త జీపీలకు లేని సొంత భవనాలు
- అంగన్‌వాడీ, పాఠశాల గదుల్లోనే కార్యకలాపాలు
- నిజాంపేటలో అద్దె భవనాల్లో ఆఫీసులు
- తొమ్మిదేళ్లయినా రూపు మారని వైనం

పేరుకే ఆదర్శ గ్రామం..

తూప్రాన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలోని మల్కాపూర్ ఒకప్పుడు స్వచ్ఛభారత్ నిర్వహణలో మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు సాధించి ఆదర్శ గ్రామంగా పేరు పొందింది. ఈ ఆదర్శానికి చిహ్నంగా రూ.80 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, రూ. కోటితో ఫంక్షన్‌హాల్, రూ.75 లక్షలతో సామాజిక భవనం, రూ.32 లక్షలతో మహిళా భవనం, రూ.29 లక్షలతో యూత్ అండ్ గ్రంథాలయ భవనాలు సహా అనేక నిర్మాణాలు చేపట్టారు. కానీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో వృథాగా ఉండిపోయాయి. కోటి రూపాయలతో నిర్మించిన ఫంక్షన్‌హాల్ నిర్వహణ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. సామాజిక భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి, కనీసం సమావేశాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొన్నది. ఇక యూత్ భవనం కూలీలకు వసతిగా మారగా, గ్రంథాలయ భవనం రేషన్ దుకాణానికి ఉపయోగపడుతోంది. పుస్తకాలు, క్రీడా, జిమ్ సామాగ్రి ఏమీ ఏర్పాటు చేయలేదు. స్వచ్ఛభారత్ కార్యక్రమం నిలిపివేయడంతో గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. మహనీయుల పేర్లతో ఉన్న వీధులు కంపుకొడుతున్నాయి.



అల్లాదుర్గం : ఐబీ గిరిజన తండాలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం

కొత్త పంచాయతీలకు పక్కా భవనాలేవి?

అల్లాదుర్గం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఐదు వందల జనాభా కలిగిన గ్రామాలను, గిరిజన తండాలను కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినా, ఈ నూతన కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. అల్లాదుర్గం మండలంలోని సీతానగర్, ఐబీ గిరిజన తండా, గొల్లకుంట గిరిజన తండాల పరిస్థితి ఇదే. ఈ గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర వసతుల మధ్య విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొన్నది. ఉదాహరణకు, గొల్లకుంట తండా గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగుతోంది, అక్కడ ఒకే ఒక్క గదిలో అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయం రెండు నడుస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక సీతానగర్, ఐబీ గిరిజన తండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల కోసం ఉపాధి హామీ నిధుల ద్వారా ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరైనప్పటికీ, అధికారులు ఇంతవరకు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టలేదు. దశాబ్ద కాలం కావస్తున్నా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు.



అల్లాదుర్గం : సీతానగర్ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం

తొమ్మిదేళ్లయినా మారని నిజాంపేట రూపు..

నిజాంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట నుంచి విడిపోయి మండలంగా ఏర్పడి తొమ్మిదేళ్లు కావస్తున్నా నిజాంపేట మండల కేంద్రం రూపురేఖలు మారడంలేదు. మండల కేంద్రంగా గుర్తించినా, ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయానికి కూడా ప్రభుత్వం కొత్త భవనాలను నిర్మించలేదు. 2016 లో ఇక్కడ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంఈవో, వ్యవసాయ, ఎంపీడీవో కార్యాలయాలు ప్రారంభించారు. కానీ ఇవన్నీ పెంకుటిళ్లలో, ఎప్పుడు కూలుతుందో తెలియని శిథిలావస్థలకు చేరిన పురాతన అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. పురాతన ప్రభుత్వ పాఠశాలలో పోలీస్ స్టేషన్, పెంకులు పగిలిన శిథిల భవనంలో తహసీల్దార్ కార్యాలయం నడుస్తుండడం గమనార్హం. పీహెచ్‌సీ స్థల పరిశీలన జరిగి ఏడాది కావస్తున్నా అతీగతీ లేదు. కస్తూర్బా గురుకులం మంజూరైనా భవనం లేక పిల్లలను రామాయంపేట గురుకులంలో చేర్చారు. పేరుకు మండల కేంద్రం అయినప్పటికీ, గ్రామ పంచాయతీకి ఉన్న వసతులు కూడా ఇక్కడ లేకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వినియోగంలోకి తేవాలి..

ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన విలువైన భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని, కొత్త భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యలపై దృష్టి సారించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెంకుటింట్లో ఎంపీడీవో కార్యాలయం

సిధారెడ్డి రచించిన 'నాగటి తరం' నవల ఆవిష్కరణ



సిధారెడ్డి రాసిన నాగటితరం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

కొండపాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని అర్థం చేసుకుంటే మొత్తం దేశాన్నే అర్థం చేసుకున్నట్లే. 'నాగటి తరం'లో గ్రామీణ జీవితంలోని చిన్న చిన్న పుటలు కూడా చరిత్రాత్మకమైన లోతుతో నిండి ఉన్నాయి అని ప్రముఖ కవి రచయిత నాళేశ్వరం శంకరం అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారం గ్రామంలో మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో రచయిత నందిని సిధారెడ్డి రాసిన 'నాగటి తరం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు రచయితలు, కళాకారులు మాట్లాడారు. ముందుగా నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ... తెలంగాణ భాష, సంగీతం, పల్లె జీవన విధానంలోని సాదాసీదా స్వచ్ఛతతో పాటు, కుల, వర్గ, సామాజిక ఒత్తిళ్ల తాలూకు చేదు అయిన నిజమైన వాస్తవికతను రచయిత్రి హృదయపూర్వకంగా చిత్రీకరించారన్నారు. ఈ నవలలోని వ్యక్తులు కేవలం పాత్రలు కావని, వారు మన గ్రామాల్లో నడిచే మనుషులని పేర్కొన్నారు. వారి పేదరికం, ధైర్యం, నిర్వేదం, ప్రేమ అన్నీ కలగలిసి ఒక తరాన్ని అక్షరాల్లో బంధించాయన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ 'నాగటి తరం' కేవలం కథ కాదని, ఇది రక్తంతో రాసిన చరిత్ర అన్నారు. ధైర్యవంతుల వ్యక్తిత్వం, వారి పోరాటాలు, వారి త్యాగాలు పుటల్లో సజీవంగా కనిపిస్తాయన్నారు. టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవి ప్రసాద్ మాట్లాడుతూ సాహిత్యం కేవలం చదవడానికి కాదని, అది మార్పు కోసం అని, అది ఒక తరానికి దిక్సూచి లాంటిదని చెప్పారు. రచయిత నందిని సిధారెడ్డి మాట్లాడుతూ 'నా తండ్రి జీవితం, మా కుటుంబపు పోరాటం, గ్రామ స్థాయిలో జరిగిన అనేక సంఘటనలు ఇవన్నీ నాకు రాయమంటూ పిలిచాయి. ఈ నవల మా ఇంటి కథ మాత్రమే కాదని, మా గ్రామం కథ, మా తరాల కథ' అని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు నక్క యాదవ రెడ్డి, దేవదాసు నర్ర భగవాన్ రెడ్డి, బాల్ నరసయ్య, జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రచయిత కందుకూరి శ్రీరాములు, టేకులపల్లి గోపాల్ రెడ్డి, కొమురవెల్లి అంజయ్య తదితరులు మాట్లాడారు. సీనియర్ జర్నలిస్ట్ బైస దేవదాసు సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కూతురు రాజిరెడ్డి, పలువురు కళాకారులు, కవులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న ఏడుపాయల

పాపన్నపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, జంట నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు అమ్మ నామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి, సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు మాతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఏడుపాయల ఔట్ పోస్టు సిబ్బంది బందోబస్తు చేపట్టారు.



నాచగిరిలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

ఆదిత్య మండల ఆకృతిలో దీపారాధన

వర్గల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదివారం ఆదిత్య మండల ఆకృతిలో దీపాలంకరణ చేశారు. కార్తీక మాసం సందర్భంగా నాచగిరి క్షేత్రానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. సుమారు 300 వరకు ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయ రామారావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది నిర్వహించారు.



భక్తులకు దర్శనమిస్తున్న కొండపోచమ్మ

కొండపోచమ్మ ఆలయంలో..

జగదేవ్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్‌నర్సాపూర్ సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండపోచమ్మకు భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారిని దర్శించుకుని, ఒడి బియ్యం పోసి, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లన్న సేవలో కలెక్టర్ హైమావతి



కలెక్టర్ హైమావతికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆలయాధికారులు, అర్చకులు

కొమురవెల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని కార్తీకమాసం ఆదివారం సందర్భంగా కలెక్టర్ హైమావతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. స్వామివారి తీర్థప్రసాదాలను, శేష వస్త్రాలను అందించగా, ఆలయ కార్యనిర్వహణ అధికారి టంకశాల వెంకటేష్ స్వామి వారి చిత్ర పటాన్ని అందించారు. వచ్చే నెల 14 వ తేదీన జరగనున్న మల్లికార్జున స్వామి కల్యాణ ఏర్పాట్లపై కలెక్టర్ ఆలయాధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, సహాయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ వేణుగోపాల్, ఏఎంపీవో శ్రీనివాస వర్మ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన వీరభద్ర స్వామి ఆలయం



వీరభద్రస్వామి ఆలయం ప్రాంగణంలో భక్తుల సందడి

గుమ్మడిదల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. దర్శనానికి ఐదు నుంచి ఆరు గంటల సమయం పట్టింది. పాలకమండలి, ఆలయ సిబ్బంది పర్యవేక్షకుడు సోమయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. భువనగిరి జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి, నర్సాపూర్ మెజిస్ట్రేట్ హేమలత ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో శశిధరగుప్తా, ఆలయ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, ధర్మకర్తలు భాస్కర్ గౌడ్, పొన్నబోయిన రాజు అధికారులు, విశిష్ట అతిథులను స్వాగతించారు.

20న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికలు



మాట్లాడుతున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు.

సిద్దిపేట కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో ఈ నెల 20న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు, పురుషులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో ఎంపిక పోటీలుంటాయన్నారు. ఆసక్తి కలిగిన జిల్లా క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో రిపోర్టు చేయాలని చెప్పారు. జూనియర్ విభాగంలో ఎంపికైనవారు డిసెంబరు 5 నుంచి 7 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా నుంచి పాల్గొంటారని తెలిపారు. అలాగే సీనియర్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 11 నుంచి 14 వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సిద్దిపేట జిల్లాలోని కబడ్డీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కోసం 9550847409, 9177822113, 9912585879 నంబర్లను సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు సంపంగి రాజు, సంయుక్త కార్యదర్శులు శ్రీకాంత్, కరుణాకర్, మహేష్, నరేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

'అమ్మకు అక్షర మాల'ను విజయవంతం చేయండి

● ఉమ్మడి జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి



పొదుపు సంఘాల మహిళలకు అక్షర వికాసం పుస్తకాలు వెంకట్‌రెడ్డి

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత నిర్మూలన కోసం నిర్వహిస్తున్న 'అమ్మకు అక్షర మాల' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్‌రెడ్డి కోరారు. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో ఆదివారం ఐకేపీ మండల, గ్రామ మహిళా సమైక్య ప్రతినిధులు, సీసీలు, వీవోఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యత నిర్మూలనకు ఉల్లాస్ యాప్‌లో పొదుపు సంఘాల్లోని నిరక్షరాస్యుల పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో ఉన్న వారికి చదువుకున్న పొదుపు సంఘాల సభ్యులు అక్షరాలు నేర్పించి, కనీస చదువు వచ్చేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ కార్యక్రమం అమలు కోసం శిక్షణలు కొనసాగుతున్నాయని, త్వరలోనే క్షేత్ర స్థాయిలో వయోజన విద్యా కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కల్హేర్, సిర్గాపూర్ ఐకేపీ ఏపీఎంలు వంశీకృష్ణ, సరిత, సెర్ప్ సీఆర్‌పీలు జాహెదా, సునిత, సీసీలు, వీవోఏలు, మండల, గ్రామ మహిళా సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీస్, ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే పోలీస్, ప్రెస్ వర్గాల మధ్య రాబోయే రోజుల్లో సత్సంబంధాలు పెంపొందించేందుకు ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలీస్, ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న ప్రెస్ టీం 15.5 ఓవర్లలో 101 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పోలీస్ జట్టు 11.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ప్రెస్ జట్టుపై విజయం సాధించింది. టోర్నీలో చివరి పరుగును ఎస్పీ శ్రీనివాసరావు చేసి జట్టుకు విజయాన్ని అందించారు. అత్యధిక పరుగులు చేసిన ఆర్ఎస్ఐ నరేష్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచారు. విజేతగా నిలిచిన పోలీసు జట్టుకు, రన్నరప్‌గా నిలిచిన ప్రెస్ జట్టుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి బహుమతులను అందజేశారు. అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, రంగా నాయక్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, పోలీసులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లాకు తృతీయ స్థానం



బహుమతి అందుకుంటున్న ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు

మెదక్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. పాఠశాల క్రీడా సమాఖ్య తెలంగాణ ఆధ్వర్యంలో నల్గొండలో గత మూడు రోజులుగా రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర టోర్నమెంట్ జరిగింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ ప్రథమ, మహబూబ్‌నగర్ ద్వితీయ స్థానం సాధించాయి. రంగారెడ్డి-మెదక్ ఉమ్మడి జిల్లా మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్ డ్రాతో ముగిసింది. అనంతరం ఇరు జట్ల మధ్య జరిగిన పెనాల్టీ షూట్ అవుట్‌లో మెదక్ జిల్లా జట్టు 4-3 తేడాతో రంగారెడ్డిపై విజయం సాధించింది. శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్ చేతుల మీదుగా జట్టు బహుమతి అందుకున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు.

సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు

నారాయణఖేడ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం హుండీ డబ్బులు లెక్కించారు. గత ఆరు నెలల అనంతరం భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలు లెక్కించగా ఆలయానికి రూ.89,500 వచ్చింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు హుండీ డబ్బులు సమర్పించిన భక్తులకు, లెక్కించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తం

నేడు ఖేడ్ డివిజన్‌లో పత్తి కొనుగోళ్లు బంద్

నారాయణఖేడ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న ఎనిమిది పత్తి మిల్లుల్లో తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం పత్తి కొనుగోలు చేయడం లేదని మార్కెట్ కమిటీ కార్యదర్శి వీర్‌శెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోళ్ల బంద్‌లో భాగంగా పత్తిని కొనుగోలు చేయడం లేదని, అందువల్ల పత్తి రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

18న కార్తీక దీపోత్సవం

నారాయణఖేడ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని కల్పనా హనుమాన్ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు ఈ నెల 18న ఉదయం 8 గంటల నుంచి స్వామి వారికి అభిషేకం, చందనోత్సవం, మూల మంత్రహోమాలు, సాయంత్రం 5 గంటల నుంచి దీపకాంతులతో శివపార్వతుల కల్యాణోత్సవం, కార్తీక దీపోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

20న సత్యసాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

నారాయణఖేడ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న శంకర కంటి వైద్యశాల జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవాసమితి బాధ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా చికిత్సలు చేయడమే కాకుండా ఆపరేషన్‌లు అవసరం ఉన్న వారికి కూడా ఉచిత ఆపరేషన్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 9676171527 నెంబరులో సంప్రదించాలన్నారు.

పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జట్ల భాస్కర్

నారాయణఖేడ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణపద్మశాలి సంఘం సంగారెడ్డి, మెదక్ జిల్లాల యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం సంగారెడ్డిలోని విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సంఘం భవనంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహఖ కార్యదర్శి మామిడాల రవికుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా నారాయణఖేడ్‌కు చెందిన జట్లభాస్కర్, అసోసియేట్ అధ్యక్షులుగా చింతబలరాం, డాక్టర్ పట్నంగిరి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కోమటిశ్వేత, ఆడెపు ఆంజనేయులు, కవిగోపాల్, గోలయాదగిరి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కోటవరప్రతాప్, సహాయ కార్యదర్శులుగా బుజ్జాల అరుంధతి, గొంట్యాల వెంకటేశం, బిజ్జామన్మోహన్, జానకీరాం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నూకల రవీందర్, రుమాండ్ల వెంకటేశం, ముత్యాల సాయిప్రసాద్, శివకుమార్, కోశాధికారిగా న్యాలం శివకుమార్, ప్రచార కార్యదర్శిగా వుల్గం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కొండిరాజు,లక్ష్మినారాయణ, శ్రీలత, విశ్వాసుకుమార్, వెంకటేశ్వర్, అరుణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో చంద్రశేఖర్, బెస్త సంఘం సభ్యులు

చిన్నశంకరంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయానికి ఆదివారం బెస్త సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ, ప్రజా సేవకుడు కంజర్ల చంద్రశేఖర్ తన సొంతనిధులతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన బెస్త సంఘం వారు నిర్మాణానికి సహకరించాలని కోరడంతో అంగీకరించి వెంటనే భూమి పూజ చేసినట్టు తెలిపారు. ఆలయాన్ని త్వరలోనె పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

జిన్నారం, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి): జిన్నారం రంగనాయక స్వామిగుట్టపై ఆలయం వద్ద ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

ఊరి ముంగిట చెరువు.. తాగునీటికి కరువు

- బడంపేట గ్రామంలో నీటి కటకట





బడంపేటలోని బీసీ కాలనీలో కొన్ని రోజులుగా, ఎస్సీ కాలనీలో కొన్ని నెలలుగా పాడైన బోర్లు

కోహీర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామం చెంతనే చెరువు.. చుట్టుపక్కల పుష్కలమైన నీటివనరులు ఉన్నప్పటికీ గ్రామంలోని పలు కాలనీల్లో కొన్ని రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని బడంపేట గ్రామంలో అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆ గ్రామ ప్రజలకు తాగునీరు కరువైంది. గ్రామంలో తాగునీటి సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు బోర్లు చెడిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు వాటిని బాగు చేయించడం లేదు, తాగునీటి సమస్య తమ పని కాదన్నట్టుగా వ్యవహరించడం స్థానికుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. బడంపేట గ్రామంలోని మందగడ్డ ప్రాంతంలోని తాగునీటిబోరు చెడిపోయి 6 నెలలు గడిచినా అధికారులు ఆ బోరును బాగు చేయడం లేదు. అలాగే గ్రామంలోని బీసీ కాలనీలో బోరు చెడిపోయి చాలా రోజులైనప్పటికీ దాన్ని కూడా అధికారులు బాగు చేయించడం లేదు. దీంతో ఆయా కాలనీలో ప్రజలకు తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. చెడిపోయిన తాగునీటి బోర్లను బాగు చేయించి నీటి సమస్య తీర్చాలని సంబంధిత శాఖ అధికారులకు విన్నవించుకున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పాడైపోయిన తాగునీటి బోర్లను బాగు చేయించి నీటి సమస్యను తీర్చాలని బడంపేట గ్రామస్థులు కోరుతున్నారు.

జంగి.బి లో అవే తిప్పలు

కంగ్టి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కంగ్టి మండల పరిధిలోని జంగి.బి గ్రామంలో తాగునీటి బోర్లు మరమ్మతులకు నోచుకోక పోవడంతో గ్రామస్థులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాక పోవడంవల్ల ఎక్కడ నీరుంటే అక్కడికి మహిళలు పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చేతి పంపు, త్రీ ఫేజ్ బోరు మోటార్ చెడి పోయినప్పటికీ మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి తక్షణమే బోర్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



మరమ్మతులకు నోచుకోని త్రీ ఫేజ్ బోరు



ప్రకృతి ఒడిలో ఎన్నో వింతలు.. చూడ ముచ్చటైన పులకింతలు.. కొన్నాళ్లుగా మోడువారిందనుకున్న మామిడి చెట్టు కొత్త చిగురులు తొడుగుతూ, ఇలా రంగు మారిన ఆకులతో చూపరులను కట్టిపడేస్తోంది. కొమ్మలు నరికివేతకు గురై మోడువారినప్పటికీ తిరిగి చైతన్యాన్ని నింపుకుని సరికొత్తగా చిగురిస్తున్న ఈ చెట్టు మన సమాజానికి పాఠాలు నేర్పే గురువుగా మారిందనడంలో అతిశయోక్తి లేదేమో.. లేత ఆకులు.. విభిన్న రంగుల ఆకారంలో చిగురిస్తూ ప్రకృతికి ప్రతి రూపంగా కనిపించే ఈ అరుదైన దృశ్యం రామాయంపేట బైపాస్‌కు ఆనుకొని సర్వయ్య కుంట పైలాన్ వద్ద ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కింది.

- రామాయంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి)

హాస్టల్ విద్యార్థులకు వనభోజనాలు





సిర్గాపూర్ గ్రామ శివారులో, రంగంపేట గ్రామ శివారులో ఆయా హాస్టల్ విద్యార్థుల వన భోజనాల

కల్హేర్/సిర్గాపూర్/కొల్చారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థుల మనోవికాసం, అభివృద్ధి కోసం షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ఆదివారం వనభోజనాలను ఏర్పాటు చేసినట్లు సిర్గాపూర్ ఎస్సీ హాస్టల్ సంక్షేమ అధికారి కిషన్, కొల్చారం హాస్టల్ వార్డెన్ పరుశురాం పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ గ్రామ శివారులో సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు అదే విధంగా మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని హాస్టల్ విద్యార్థులకు రంగంపేట గ్రామ శివారులో వేర్వేరుగా వనభోజనాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు రోజంతా ఉల్లాసంగా ఆట పాటల మధ్య గడిపారు.. అనంతరం సామూహిక వన భోజనం చేశారు ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉన్నందున వారికి మానసికంగా ఉల్లాసం కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు.

హరీశ్‌రావుపై కవిత ఆరోపణలు నిరాధారం



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు తదితరులు

నర్సాపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై ఎమ్మెల్సీ జాగృతి అధ్యక్షురాలు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. హరీశ్‌రావుతో పాటు ఆయన కుటుంబీకుల పేరిట ఇక్కడ భూములు ఉన్నట్టు నిరూపిస్తే వాటిని పేదలకు పార్టీ ఆధ్వర్యంలో పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని అందుకు కవిత సిద్దమా? అని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ కవితకు సవాల్ విసిరారు. ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి స్వగృహంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, పార్టీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాగృతి అధ్యక్షురాలు కవిత ఈ స్థాయికి వచ్చిందంటే బీఆర్ఎస్ పెట్టిన భిక్షతో పాటు తమ నాయకుడు కేసీఆర్ కూతురు అయినందునే అని గుర్తు చేశారు.

బీఆర్ఎస్ ద్వారా అనేక రకాలుగా లబ్దిపొంది ఇప్పుడు అదే పార్టీకి చెందిన అగ్ర నాయకులను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మెదక్ జిల్లాలో కవిత పర్యటకు ప్రజల నుంచి ఏ మాత్రం ఆదరణ లేకుండాపోయిందన్నారు. కవిత తీరు చూస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డికి కోవర్టుగా వ్యవహరిస్తున్నట్లు అనిపిస్తుందని వారు ఆరోపించారు. అదేవిధంగా మాజీ జడ్పీ కో ఆప్షన్ మన్సూర్ కూడా ఓ ప్రకటలో కవిత హరీశ్‌రావుపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

సాదా బైనామాలకు మోక్షం లభించేనా?

- భూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు
- కోహీర్ మండలంలో 150 ఫైళ్లలో ఒక్కదానికీ అనుమతి లభించని వైనం



భూ సమస్యల పరిష్కారానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)

కోహీర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వాలు ఎన్నో బృహత్తర కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం మూలంగా అర్హులైన రైతులకు న్యాయం జరగడం లేదనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు నిదర్శనమే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని ఆయా గ్రామాల నుంచి సాదా బైనామా భూ సమస్య పరిష్కారం కొరకు 150 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఏ ఒక్క ఫైల్‌కు కూడా రెవెన్యూ అధికారులు అప్రూవల్ ఇవ్వకుండా అన్నింటినీ తిరస్కరణ జాబితాలో చేర్చారు. గతంలో తెల్ల కాగితంపై, స్టాంప్ పేపర్లపై భూమి కొనుగోలు చేసిన రైతులు కబ్జాలో ఉంటూ సాగు చేసుకుంటున్నప్పటికీ వారి పేర్ల పైన పట్టా కాకపోవడం పాసుబుక్కులు అందలేదు. ఇలాంటి రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో ప్రభుత్వం సాదా బైనమా భూసమస్య పరిష్కారం కోసం ప్రత్యేక మాడ్యూల్ తీసుకువచ్చింది. తెల్ల కాగితం లేదా స్టాంప్ పేపర్‌పై భూమి కొనుగోలు చేసిన రైతులకు న్యాయం చేస్తామని వారి పేరు పైన పట్టా చేస్తామని ప్రభుత్వం సూచించింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం అలాంటి రైతులకు న్యాయం జరగడం లేదు. సాదా బైనామా భూ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వివిధ రకాల నిబంధనలు పెట్టడం వల్ల భూ సమస్యలను పరిష్కరించడం కుదరడం లేదని మండల రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేసి రెవెన్యూ అధికారులకు నూతన ఆదేశాలు అందించి సాదా బైనామా భూ సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.



నర్సింహారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి దామోదర్

నర్సింహారెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

అల్లాదుర్గం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి మరణవార్త తన నెంతో కలిచివేసిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మండలంలోని చిల్వర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, వట్‌పల్లి ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు ముక్కెర నర్సింహారెడ్డి అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ చిల్వర గ్రామానికి వచ్చి నర్సింహారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మంత్రి మాట్లాడుతూ నర్సింహారెడ్డి మరణం పార్టీకీ తీరని లోటన్నారు. వీరి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

రాచిరెడ్డిని పరామర్శించిన చింతా ప్రభాకర్



రాచిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు నవాబు రాచిరెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ రాచిరెడ్డిని పరామర్శించి ఆరోగ్యపరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, మెరుగైన వైద్యం అందేలాచూస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆయనకు భరోసా కల్పించారు ఎమ్మెల్యే వెంట మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీలమల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, మండల అధ్యక్షుడు పెద్దగొల్ల అంజనేయులు తదితరులు ఉన్నారు.

లింగాపూర్‌లో శివపార్వతుల కల్యాణం

నారాయణఖేడ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగాపూర్‌లో మార్కండేయ ఆలయ చతుర్థ వార్షికోత్సవం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ జన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ భూతం

(5వ పేజీ తరువాయి)

ఆశ చూపడం, ఆకర్షణీయమైన ప్రకటనలతో యువతను, నిరుద్యోగులను ఉచ్చులోకి లాగుతున్నాయి. ఉన్న డబ్బుతో పాటు, అప్పులు చేసి మరి ఆడుతూ ఉన్నదంతా పోగొట్టుకుంటుని ఈ ఊబిలో కూరుకుపోతున్నారు.

పోలీసుల హెచ్చరికలు.. ఆగని బెట్టింగ్‌లు

బెట్టింగ్‌లకు పాల్పడవద్దని, డబ్బు పోగొట్టుకుని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పోలీసులు పత్రికలు, సోషల్ మీడియా ద్వారా పదే పదే హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఇలాంటి యాప్‌లను ప్రమోట్ చేయొద్దని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, సెలబ్రిటీలకు హెచ్చరికలు జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు వ్యతిరేకంగా పోలీసులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ, ఈ దందా మాత్రం ఆగడం లేదు.

వావిలాలలో పరిశ్రమల జాతర!

(5వ పేజీ తరువాయి)

పనులను టీఎస్ఐఐసీ చేపట్టింది. రహదారులు, విద్యుత్, నీరు వంటి ఇతర సదుపాయాల కలన కోసం ఇటీవలే టెండర్లు నిర్వహించి పనులను ప్రారంభించారు.

80 అడుగుల రహదారికి భూసేకరణ

పారిశ్రామిక పార్కుకు వెళ్లే ప్రధాన రహదారి సమస్య పరిష్కారం కోసం అధికారులు చర్యలు చేపట్టారు. కొర్లకుంట సమీపం నుంచి సుమారు ఒక కిలోమీటర్ మేర 80 అడుగుల విస్తీర్ణంతో ప్రధాన రహదారిని నిర్మించాలని నిర్ణయించారు. ఈ రహదారి ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ కోసం 35 మంది రైతుల భూములను గుర్తించారు. భూమిని కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించేందుకు సంబంధించిన ఫైలును రెవెన్యూ, టీఎస్ఐఐసీ అధికారులు పరిశీలించి సంగారెడ్డి కలెక్టర్‌కు పంపించారు.

మరిన్ని పరిశ్రమలకు స్థలం

సర్వే నంబర్ 190లో మొత్తం 60 ఎకరాల సీలింగ్ భూమి ఉన్నప్పటికీ, ప్రస్తుతం 34 ఎకరాలు మాత్రమే పరిశ్రమల కోసం కేటాయించారు. మిగిలిన 26 ఎకరాల స్థలాన్ని కూడా సర్వే చేసి పరిశ్రమల కేటాయింపునకు సిద్ధం చేస్తే, మరిన్ని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటు అయ్యేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

బీసీల రిజర్వేషన్ బిల్లు గవర్నర్ ఆమోదించాలి



సంగారెడ్డిలో బీసీ న్యాయ సాధన దీక్ష చేపట్టిన జేఏసీ నాయకులు

సంగారెడ్డి రూరల్ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని బీసీ జేఏసీ చైర్మన్ ప్రభుగౌడ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ఆదివారం బీసీ జేఏసీ నాయకులు న్యాయ సాధన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, చట్ట బద్దత కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ ప్రక్రియ ద్వారా బీసీల రిజర్వేషన్లు పంచి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షలో జేఏసీ నాయకులు కృష్ణ, మల్లికార్జున్, హరి, లక్ష్మి, శ్రీకాంత్, రషీద్, సుధాకర్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, సాయి బాషా, మంజుల గౌడ్, మంగ గౌడ్, సంజీవ్, ప్రభు, జావెద్, గోపాల్ పాల్గొన్నారు.

క్యాంపుల ద్వారా సామాజిక అంశాలపై అవగాహన



ఎన్ఎస్ఎస్ క్యాంపులో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

పాపన్నపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపు ద్వారా సామాజిక అంశాలపై అవగాహన కలుగుతుందని అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. మల్లంపేట గ్రామంలో ఆదివారం పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల తరపున ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... ఎన్ఎస్ఎస్ క్యాంపు ద్వారా సేవాభావంతో సమాజానికి మేలు చేయాలనే ఆలోచన విద్యార్థుల్లో కలుగుతుందన్నారు. తాను కూడా విద్యార్థి దశలో ఎన్ఎస్ఎస్ క్యాంపులలో అనేక విషయాలు నేర్చుకున్నానని విద్యార్థులకు వివరించారు.గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, అధ్యాపకులు సంతోష్ కుమార్, ప్రవీణ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఫరీద్‌పూర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

హవేళిఘణపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. ఆదివారం మండలంలోని ఫరీద్‌పూర్, పోచమ్మరాల్ గ్రామాల్లో పర్యటించారు ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు. అర్హులందరికి విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పరశురాం గౌడ్, నాయకులు శ్రీనివాస్, పోశెట్టి, వినోద్, బ్రహ్మం, తదితరులున్నారు.

అభివృద్ధిలో వేగం పుంజుకున్న మెదక్



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్

మెదక్ మున్సిపాలిటీ/మెదక్ అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యువ ఎమ్మెల్యే నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధివైపు పరుగులు తీస్తుందని మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేడి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. మెదక్ మున్సిపాలిటీకి ఇప్పటికే రూ.48.70 కోట్లు మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.34 కోట్లు, యూఐడీఎఫ్ ద్వారా రూ.14.70 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. మెదక్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అహర్నిశలు శ్రమిస్తున్నట్లు చెప్పారు. మెడికల్, నర్సింగ్ కాలేజీలు, ఆర్టీఏ కార్యాలయం త్వరలోనే నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, కృషి చేసిన ఎమ్మెల్యే రోహిత్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మినారాయణగౌడ్, ముత్యం గౌడ్, హమీద్, ప్రవీణ్‌గౌడ్, రాములు, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో నెరవేరిన పేదల కల

మనోహరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల కల నేరవేరిందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో మందుల శ్యామల నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని నర్సారెడ్డి ప్రారంభించారు. అలాగే కాళ్లకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కటికే అశోక్ రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో అతడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మనోహరాబాద్ మండలంలోని కాంగ్రెస్ నాయకుడు నాచారం అశోక్ తండ్రి శంకర్ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, రాజుయాదవ్, పాల అశోక్, మాధం శెట్టి వెంకటేశం, గోపాల్, పెంటగౌడ్, శ్రీనివాస్, ఐలయ్య యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, పాల అశోక్, శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

మనోహరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాళ్లకల్ గ్రామంలో కరాటే ద్వారా శిక్షణ పొందిన వారికి బ్లాక్‌బెల్ట్‌లను ప్రదానం చేశారు. మండలంలోని కాళ్లకల్ గ్రామంలో సన్‌షైన్ షోటోఖాన్ కరాటే ఆర్గనైజేషన్ ఇండియా ఫౌండర్ చైర్మన్ లద్దిపిర్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కరాటే గ్రాండ్ మాస్టర్ నత్తి మల్లేష్ ముదిరాజ్, ఇతర మాస్టర్ల ద్వారా శిక్షణ పొందిన 170 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను, బెల్టులను ప్రదానం చేశారు. కొందరికి బ్లాక్ బెల్ట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు లక్ష్మణ్, మహేష్, నాగరాజు, శ్రీకాంత్, నవీన్, రాజు, రెశ్విత, అభి, బాబి, తరుణ్, సంపత్, అలాగే నరేష్, రాజు పాల్గొన్నారు.

నీటి కోసం అల్లాడుతున్న రైతులు



బస్సు యాత్ర ఖేడ్‌కు చేరుకున్న సందర్భంగా సీపీఐ నాయకులు

నారాయణఖేడ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మంజీరా పరివాహక ప్రాంత రైతులు సాగునీటి కోసం అల్లాడుతున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. ఆదివారం సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా బస్సు జాత నారాయణఖేడ్‌కు చేరుకున్న సందర్భంగా మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మంజీరా నది ప్రవహిస్తుందని, నారాయణఖేడ్ నియోజకవర్గంలోని రైతాంగం సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల రాయిపల్లి ప్రాంతంలో నూతన ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేయించి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలన్నారు. ఖమ్మంలో నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాలకు కార్యకర్తలు, ప్రజల భారీగా తరలి రావాలన్నారు. కార్యక్రమానికి జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఖాద్రి, రైతు సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌ప్రసాద్, ప్రజా నాట్యమండలి సభ్యులు సీపీఐ జిల్లా కార్యదర్శి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.